# క్షేమదాయి సాయి!



రచన

**డా. జి. సీతాదేవి**

# క్షేమదాయి సాయి!

రచన

**డా. జి. సీతాదేవి**



‘శంకరాభరణం’ ప్రచురణలు



శంకరాభరణం

శరణం పండిత మానసాపహరణం, శశ్వద్యశఃకారణం, సరసానందద వాగ్విలాస చరణం, శబ్దార్థ సంపూరణమ్।
చరదత్యద్భుత సత్కవీశ్వరగణం, సాలంబనం ‘శంకరాభరణం’, నిత్యమహం స్మరామి విలసద్ వాగ్దివ్యసింహాసనమ్।

# క్షేమదాయి సాయి!

రచన

**డా. జి. సీతాదేవి**

'శంకరాభరణం' ప్రచురణలు : 26

ఇ–బుక్ ప్రచురణ : సెప్టెంబర్ 2020

వెల : శ్రద్ధాభక్తులు

ప్రచురణ కర్త :

డా. జి. సీతాదేవి

402, భవానీ పార్క్ లేన్,

రాంజీనగర్ నాల్గవ వీధి,

నెల్లూరు – 524 002

(Ph. 9849332496)

డి.టి.పి. : కంది శంకరయ్య

# అలవోకగా అర్ధశతకం

ఎంతటి ఛందోవ్యాకరణ శాస్త్రజ్ఞానమున్నా, భాషాపాండిత్యమున్నా ఒక్కొక్కసారి పని గట్టుకొని కూర్చున్నా ఒక్క పద్యం కూడా వ్రాయలేము. మనోహరమైన భావం స్ఫురించకపోవచ్చు. భావం ఉన్నా దాన్ని ఛందోబద్ధం చేయలేకపోవచ్చు. అప్పుడు కవికి ప్రసవవేదనే.

కాని ఒక్కొక్కప్పుడు అకస్మాత్తుగా ఏదో సంకల్పం కలుగుతుంది. మనసులో మనోజ్ఞమైన భావాలు, అందమైన పద్యాలు గట్టు తెగిన ప్రవాహంలా దూసుకువస్తాయి. ఇందుకు దైవప్రేరణయే మూలకారణమని భావిస్తాను. ఇది స్వానుభవం కూడా!

సీతాదేవి గారు లబ్ధప్రతిష్ఠులైన విదుషీమణి, కవయిత్రి. ఇప్పటికే వీరు కందపద్య కదంబం, శ్రీ లలితాష్టోత్తర శతకం ప్రకటించి తమ బహుముఖీయమైన ప్రతిభను చాటుకొన్నారు.

వీరు సాయి భక్తురాలు. ఆ షిరిడీవాసుని కటాక్షంతో అనుకోకుండా మనసులో ఒక మకుటం మెరిసింది. దానిని అనుసరించి ఆశువుగా పద్యాలూ వచ్చాయి.

శతకం వ్రాయాలన్న సంకల్పం లేదు. మనసులో తోచిన భావాలకు పద్యరూపాన్నిచ్చారు. 58 పద్యాలు వ్రాసారు. అక్కడికి ఆగిపోయారు. అంతకు మించి వ్రాయడానికి సాయి అనుమతి లేదు. పట్టుబట్టి వ్రాసినా అవి కృతకంగా, రసహీనంగా ఉంటాయి. అందుకే అర్ధశతకంతో తృప్తిపడ్డారు కవయిత్రి గారు.

పద్యాలన్నీ సులభశైలిలో పండిత పామరరంజకంగా ఉన్నాయి. అన్నీ సాయితత్త్వాన్ని ప్రతిపాదించేవే. ఎక్కడా గణ యతి ప్రాసల కోసం కక్కుర్తి పడటం కనిపించదు. హాయిగా చదువుకొని ఆ షిరిడీ సాయి అనుగ్రహానికి పాత్రులం కావచ్చు.

**కంది శంకరయ్య**

వరంగల్లు

# నా మనవి

సహృదయులు, సద్గురు భక్తులైన పాఠకులందరికీ నమస్కారము. 17/9/20 గురువారం సాయంకాలం ఏదో పనిలో ఉండగా "షిర్డిసాయి మాకు క్షేమదాయి" అని పలుమార్లు స్ఫురించినది. మరొక అరగంటలో మొదటి పది పద్యాలు ఆశువుగా వచ్చాయి. నా మది పులకించినది. మా స్నేహితురాలు హేమలత గారికి పంపితే చాల బాగున్నాయి, కొనసాగించమని ప్రోత్సహించారు.

బాబా ఆజ్ఞగా భావించి సచ్చరిత్రలోని ఆయన లీలలను కొన్ని వ్రాయదలచు కొన్నాను. నాకు గుర్తుకు వచ్చినవి గుర్తువచ్చినట్లుగా పద్యాలు అల్లాను. తర్వాత వాటిని ఒక క్రమంలో అమర్చడం జరిగింది! చిన్న పద్యాలు కనుక మరునాటికే పూర్తి అయినది. ఇది చాల అద్భుతంగా, అసంకల్పితంగా జరిగిన సాయిలీల!

మా గురువుగారు శ్రీ కంది శంకరయ్య గారిని "అర్ధశతకం వ్రాయవచ్చా?" అని అడిగితే ఫరవాలేదన్నారు. ధైర్యం వచ్చింది. వారే దయతో తప్పులు సరిదిద్ది పిడియఫ్ తయారుచేశారు. వారికి ఆజన్మాంతం కృతజ్ఞురాలిని.

సాయి సచ్చరిత్రలోని ఒక్కొక్క సంఘటన లేదా లీలను ఒక చిన్న ఆటవెలది పద్యంలో అమర్చడానికి ప్రయత్నించాను. క్లుప్తంగా ఉండడం వల్ల సచ్చరిత్ర చదవని వారికి కొంచెం సులభగ్రాహ్యం కాకపోవచ్చు. మన్నించండి. ఈ పద్యాలలోని ఒప్పులన్నీ సాయివి. తప్పులన్నీ నావి.

ఇక చదవి ఆనందించండి!

హరిః ఓం తత్సత్ ఓం!

సాయి పాదరేణువు

**సీతాదేవి**

# క్షేమదాయి సాయి!

ప్రార్థన

షిర్డిసాయి! నాదు జిహ్వపై నెలకొని
సత్యవాక్కు నిమ్ము సరసగతిని
సచ్చరిత్ర వ్రాయ సమ్మతి నిడుమయా
జన్మ ధన్యమగును జాతవేద!

ఆత్మలోన నిల్చి యాజ్ఞల నొసగెద
వర్ధశతక మొకటి యమర వ్రాయ
సర్వత యదియేమొ యన్ని నీ వెఱుగుదు
త్రికరణముల నడపు తిన్నగాను

అర్థకామములవి వ్యర్థమే యన్నట్టి
సిద్ధపురుషుడీవు, దిద్దగలవు
స్పర్థ క్రోధములను సంసార పీడల
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 1

శ్రద్ధ యోర్పులనెడు చక్కని దక్షిణ
కోరుచుందు వీవు కొరతలేక
శాంతిపూర్ణవార్ధి! సచ్చిదానందుడ!
శిర్డిసాయి మాకు క్షేమదాయి! 2

సర్వ రోగములను చక్కదిద్దెడు భిష
గ్వరుడవైన నీవు కాంచవేమి
భక్తజనులు పడెడు భవరోగ బాధల
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 3

చీకుచింత లేక సేదదీరెద నీదు
పాద పంకజముల పరమశాంతి
వేదవేద్య! మమ్ము వెన్నంటి యుండు శ్రీ
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 4

తల్లిదండ్రి మరియు త్రాతవు నీవెయై
యెల్లలేని ప్రేమ నెల్లవారి
హృదయములను నిల్పి యెంతొ హ్లాదము నింపు
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 5

శిక్షకుడవు నీవె క్షేమకరుడ వీవె
సాక్షినీవె యమల మోక్షమీవె
అక్షయ వరదుడవు మోక్షప్రదాతవు
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 6

వమ్ముగాదు నీదు వాక్య మెపుడు నిన్ను
నమ్మినట్టి వారి సొమ్ము నీవు
చెమ్మగిలిన కనుల చేకొందు వార్తుల
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 7

బుద్ధియందు మిగుల పుణ్యపుటూహల
వృద్ధిజేసి జనులు వెన్ను జేర
సత్పథమ్ము జూపు సద్గురువైనట్టి
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 8

నెలవు నీకు నయ్యె నింబవృక్ష చ్ఛాయ
కల్పవృక్ష మీవు కామధేను
వీవు తలచినంత వీగు చింతలవెల్ల
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 9

సన్నుతాంగ! నీదు సత్యస్వరూపమ్ము
కన్న విన్న వారి పున్నెమదియె
యెన్నిమారు లైన సన్నుతింతును నిన్ను
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 10

భిన్నభిన్న మతపు భేదమెంచక నీవె
యన్ని జీవులందు నాత్మగాను
చెన్నుమీర నిల్వ చేయెత్తి మ్రొక్కెద
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 11

నిత్య సత్యమదియె నిఖిల లోకంబుల
వ్యాప్తి చెందియున్న వాడొకండె
మాయ గ్రప్పినంత మరుగున బడు గదా
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 12

అమృతభాండ మెదుట యమరియున్నను గాని
యత్రు చాచుచుందు రన్నమునకు
రత్నమున్న గాని రాయికై వెదకునే
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 13

సాయిచరిత యనెడు సద్గ్రంథ మొక్కటి
హేమ భూషణమ్ము హేమ పంతు
వ్రాసియుంచె మాదు వ్రాతల మార్చగ
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 14

వేప చెట్టుక్రింద వేయేళ్ళ స్వామి దా
బాల యోగి వలెను వ్యక్తమయ్యె
షిర్డి పుణ్యభూమి శ్రీమంతమై వెల్గ
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 15

కన్నతల్లి వోలె కడుపు నింపునెపుడు
వెదకి వెదకి యడవి వెంట దిరిగి
బాయిజమ్మ పుణ్య ఫలమదేమొ తలప
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 16

లెండి వనమునందు దండిగా పూవులు
సందడించునట్లు సాకినావు
షిరిడికెల్ల గొప్ప సింగార మాయెగా
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 17

గోలికాయ లాడు కుర్రవాళ్ళను గూడి
రామభజన సేయు రచ్చబండ
దానమిచ్చు రోజు తన చుట్టువారికి
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 18

తప్పిపోయి హయము తల్లడిల్లిన వేళ
నానవాలు జెప్పి తబ్బురముగ
నిప్పు నీరు దెచ్చి నెయ్యము జేసిన
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 19

ఊరిలోకి వ్యాధి నొక్కింత రానీక
విసరి వేసినంత విసిరి పిండి
యంటురోగ మేది యడుగు బెట్టదు గదా
శిర్డిసాయి! నీకు క్షేమమయ్య! 20

నూనెలేక వెల్గు మానుగ దీపాలు
నీటితోనె తనరు ధాటిగాను
ఊరివారి కెల్ల నూహించనిది వింత
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 21

మూర పొడవు బల్ల చూరుకు వ్రేలాడ
సెజ్జ సేసుకొన్న యొజ్జ వీవె
యెట్టు లెక్కుచుంటి వెట్టుల దిగుదువో
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 22

చిరుగు కఫ్ని దాల్చి సిగజుట్టి పాగను
జోలెబట్టి యడుగు జోకజూడ
భక్తి శ్రద్ధ యనెడు భక్ష్యములను గాదె
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 23

కుస్తిపట్లు బట్టి వస్త్రాదుగా దల్చి
యోడిపోయినంత నొప్పుదలను
కావి రంగుగట్టి కయ్యాల మానేవు
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 24

ఖండ యోగమంద ఖండయోగివి గాగ
భీతిగొల్పి తీవు భిన్నమగుచు
గాలితిత్తు గ్రక్కి ఘన మారబెట్టేవు
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 25

చీనిలేని టీని సేవించి చోల్కరు
కూడబెట్టి సొమ్ము గురువు మ్రొక్కు
దీర్ఘగాను మెచ్చి దీవించిన వరద
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 26

గోడమీద బల్లి గోడేమి టన్నంత
అక్కజెల్లె రిద్ద రచట జేరి
ఆడుకొందు రంచు హాస్య మాడినయట్టి
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 27

దూరమున్న గాని తోరపు దృష్టిని
కూర్మమట్లు బరచి కూర్మితోడ
భక్తజనుల బ్రోచు భద్రుడవైనట్టి
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 28

నీదు వారినెల్ల వాదులాడిన గాని
చెంత జేర్చుకొందు వెంతగానొ
పిచుక కాలుబట్టి పేర్మి లాగినయట్లు
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 29

విషపు కీటకముల విషమెంత యెక్కిన
నీదు వాక్కుతోడ నీల్గుగాదె
ముందుగానె సంజ్ఞ నొందేరు కొందరు
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 30

నీదు నాజ్ఞ మీరి పోదు ప్రకృతియైన
తగ్గుమన్న మంట తగ్గిపోవు
నాగుమన్న వాన యాగిపోవును గాదె
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 31

పాండురంగడైన పరమ శివుండైన
తత్త్వమరయ గాను తథ్యమీవె
గంగయమున నదులు గలవుగా నీచెంత
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 32

సర్వజీవు లందు సమరస భావన
యోగివర్య నీకు యోగ్యమగును
మోక్షమిచ్చినావు మూడు జంతువులకు
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 33

సర్వ రోగహారి శ్రద్ధతో బెట్టెడు
ఊది నుదుటి బొట్టు ఊపిరాదు
మైనతాయి ప్రసవ మైనది చిటికెలో
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 34

మంత్రమేది చెవిని మన్నించి చెప్పక
గురుని స్మరణయొకటె గొప్పదనుచు
గురువె దైవమనుచు గురిగొన్న బ్రోచెడు
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 35

కన్ను లెర్రబడగ కట్టును జీడిని
కడుపు నొప్పికేమొ కుడుపు శనగ
గొప్ప వైద్యమయ్య యెప్పుడెరుగమేము
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 36

రామనవమి యచట రమ్యంపు పండుగ
కావిరంగు ధ్వజము ఈవి దెలుపు
చందనోత్సవ మది చక్కగ జరుగును
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 37

గురువు మాటమీద గురికొన్న శ్యామకు
మేకపోతు జంప వీక నిడుచు
అడ్డుకొంటి వయ్య ఆఖరు నిముషాన
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 38

కొత్త చీరగట్టి కొమ్మయె ఆటాడె
పెట్టెలోన బెట్టి బిట్టుపాడె
తృప్తి మనమునుండు దినుసున కాదను
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 39

నిప్పు కొలిమిలోన ముప్పున బడ్డట్టి
బిడ్డ కాలకుండ యడ్డుబెట్టి
చేయి కాల్చుకున్న మాయివే నీవయ్య
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 40

దాసగణుడు జేబు దాచిన శనగలు
నేల రాలజేసి హేలగాను
హాస్య మాడునట్టి యాప్తుడౌ దేవుడ
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 41

కుష్ఠురోగి రాణ కూర్మి జేసెడు సేవ
ముసలి మావిబాయి పుణ్యసేవ
ఒప్పుకొందువు గద యొర్మితో నవ్వుచు
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 42

నారికురుపు తోడ నలతపడుచునుండ
కాకి యొకటి వచ్చి కరచినంత
నొప్పి తగ్గ ననుచు నూరడించితి వీవు
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 43

అనుమతించ కీవు యరిగిన నెటకైన
నాపదేదొ గల్గి యలమటించు
నయినగాని నీవె యాదుకొందువు గాదె
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 44

రాధకృష్ణ మాయి బాధను బాపగ
కప్పుపైకి నెక్కు కర్మ గనగ
మర్మమేదొ నీకు మాత్రమే దెలియును
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 45

దయకు నిలయమైన ద్వారకామాయిలో
అడ్డుగోడ లేదు హద్దులేదు
సర్వ జీవకోటి సంచరించును స్వేచ్ఛ
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 46

స్వప్నమందు గలసి సాక్షాత్కరింతువు
గురువు నీవె యన్న గురుతునీయ
నీదు చిత్రపటమె యీదు సముద్రము
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 47

ఐదు రూకలైన నరువియ్యలేడు దా
బ్రహ్మవిద్య కొఱకు బ్రతిమలాడు
లోభమున్న చోట లోకేశుడుండునే
శిర్డిసాయి! నీకు క్షేమమయ్య! 48

దాసగణుడు నీదు ధన్యచరిత్రను
ఆడిపాడగ జను లాకళించి
తేలి యాడినారు తేనెల వాకలో
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 49

నవ విధముల భక్తి నాణెమ్ములై గొల్వ
లక్ష్మిబాయి కిచట లభ్యమయ్యె
నీదు కృపయె యున్న పాదుకొనును భక్తి
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 50

నూత్న కార్యమొకటి యత్నించ చేపట్ట
నాగ్రహింతు వీవె యడ్డుపడుచు
నంతలోనె తగ్గి యాశీర్వదింతువు
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 51

ముగ్గు రొక్కచోట ముచ్చట్లు పెట్టుచు
నిత్య మొక్కతీరు నిద్రగొనెడు
చావడి ఘనమైన సదనమే స్మరియింప
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 52

నీమ మొకటి నీకు నిత్యాగ్నిహోత్రుడ!
భక్తజనుల పాపపంక్తి ద్రోయ;
అగ్నిగుండ మడచు నార్తుల తాపాల
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 53

ప్రేమతోడ నిచ్చు పెరుగు పచ్చడినైన
వేపుడైన మంచి పేఠనైన
అడిగి తీసుకొందు వక్కరతోడను
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 54

ఆత్మరాము భార్య ఆకలితోనున్న
కుక్క కొక్క రొట్టెముక్క పెట్ట
తృప్తి పడుచు తనను దీవించినట్టి యో
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 55

ఎనుముబోతు నెక్కి యేగెడి మార్గము
కష్టతరము కొండ కానలందు
అంతకన్న కష్ట మాధ్యాత్మ పథమన్న
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 56

తాత్య కోసమీవు త్యాగమ్ము జేసేవు
మార్చివేసి రాత పేర్చి యిటుక
విజయదశమి నాడు విశ్రాంతి గైకొన్న
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 57

బూటివాడ యందు మురళీ ధరుండవై
వెలసినావు నీవు వేడ్కమీర
పట్టుబట్టి మేడ కట్టించు కొన్నట్టి
షిర్డిసాయి మాకు క్షేమదాయి! 58



**విన్నవింతు నీకు మన్నింప దోషముల్**
**సన్నుతింతు నిన్ను శాంతిదూత**
**తన్ను తాను దెలిసి తరియించు పథమీవు**
**షిర్డిసాయి మాకు క్షేమదాయి!**

# సాయి సంకీర్తన

(కానడ రాగం – ఆదితాళం)

**పల్లవి**

సాయినాథుడే మనకు శరణము శరణం
ప్రత్యక్ష దైవమైన యోగీశ్వరేశ్వరుడు ॥ సాయి ॥

**చరణం**

ఆది మధ్యాంతములు లేనట్టి పదము
ఆచంద్రతారార్కం నిలిచేటి పదము
ఆశ్రితజనులకు ఆనందకరము
ఆపన్నులను బ్రోచే అమృతహస్తం ॥ సాయి ॥

కర్మబంధమ్ములను ఖండించు నతడే
కామితార్థముల నొసంగు నతడే
కారుణ్యమూర్తి కల్పవృక్షము
కారణజన్ముడు కాపాడు జనులను ॥ సాయి ॥

గురవన్న నతడే గురువుల కెల్లను
గురిగలవారికి గోవర్ధనగిరి
గోదావరి కడ వెలసిన దైవము
గోవిందుడే గాద ఘనతరమహిమ ॥ సాయి ॥